పతనం

విజయనగరం స్టేషనులో హఠాత్తుగా శేషగిరిని చూసి ఆశ్చర్యపోయాను, అక్కడికెలా వచ్చాడా అని. మొదట వాణ్ణి చప్పున పోల్చుకోలేకపోయాను కూడాను. 'ఏంరోయ్ చంద్రం' అని వాడే మొదట పలకరించాక గుర్తించగలిగాను. మనిషి బాగా మారిపోయాడు. మొదట్లో బక్కపలుచగా వుండే వ్యక్తి ఇప్పుడు బాగా వొళ్ళు చేశాడు. శరీరపు ఛాయలో కూడా కాస్త మెరుపు వచ్చింది.

"ఎందాకా వెళ్తున్నావురా!" అన్నాడు కంపార్టుమెంటులోకి వస్తూ.

"వాల్తేరు వెళ్తున్నానుగాని, నువ్విక్కడేం చేస్తున్నట్టు?" అన్నాను వింతగా వాడి మొహంలోకి చూస్తు. వాడు నా ప్రశ్నకు జవాబుగా చిన్న నవ్వు నవ్వేడు.

"మనం చాలాకాలానికి అకస్మాత్తుగా కల్సుకున్నాం; ఏమంటావురా? నన్ను గుర్తు పట్టడానికి నీకు కాస్త శ్రమైనా, నిన్ను నేను సులువుగా గుర్తు పట్టేశానే. నువ్వు యిప్పటికి అలాగే వున్నావురా...నీలో యేమీ మార్పురాలేదు. ఇవన్నీ మనం తర్వాత మాట్లాడుకుందాం. నువ్వు ముందు దిగు" అన్నాడు.

"దిగడం యేవిట్రా?" వింతగా వాడి మొహంలోకి చూశాను.

"చూడరా అబ్బీ! నా సంగతి నీకేమీ తెలీందికాదు. నీకంత తొందరపని యేమున్నా వుంటే, కనీసం యీరోజు యిక్కడుండి, రేపు వెళ్ళిపో...ఏదీ నీ పెట్టె?" అని బెంచికింద చూశాడు. నేను యిరుకున పడిపోయాను. శేషగిరి మొంచి పట్టుదలగల మనిషి. వాడు యేదైనా అన్నాడంటే అది జరిగి తీరాల్సిందే! "ఇప్పుడే అన్నమాటేవిట్రా శేషగిరీ! తిరుగు ప్రయాణంలో యిక్కడ తప్పకండా దిగుతాలే..." అన్నాను.

"అదంతా పనికిరాదు. తప్పకదిగాల్సిందే" అంటూనే నేను కూచున్న బెంచికింద వున్న పెట్టె బైటికి లాగబోయాడు.

ఇక వాడెలాగూ వదలడని నాకు తెలుసు వాడిమాట జరక్కపోతే యెదుటి వారిని నాలుగు తిప్పేస్తాడు కూడాను.

"నీతో యిదే చిక్కురా! దిగుతాగాని ఒకషరతు..." అన్నా.

"ఏమిటి?"

"మళ్ళి రేపు వెళ్ళిపోతాను. నువ్వు మరేమీ ఆటంకపర్చకూడదు."

"సరే...అలాగే కానియ్..." అన్నాడు చివరికి ఒప్పుకుని.

తప్పనిసరిగా అక్కడ దిగిపోవాల్సి వచ్చినందుకు ఓ ప్రక్క బాధగా వున్నా, పాతస్నేహితుణ్ణి చాలా కాలానికి కలుసుకున్నాను కదా అన్న సంతోషం కూడా లేకపోలేదు. గార్డు పచ్చజెండా చూపిస్తూ విజిల్ వూదాడు తొందర తొందరగా సామానుతో దిగిపోయాం.

"అనవసరంగా టిక్కట్టు దండగయ్యిందిరా శేషూ" అన్నా నడుస్తూ.

"ఏం"

"కాదూ మరి వాల్తేరుకి కొన్న టిక్కట్టు అంతవరకూ వుపయోగించుకోవటం జరగదు

ఎం. హనుమంతరావు

కదా! రేపుమళ్లీ యిక్కణ్ణించి వేరే టికెట్టు కొనుక్కోవల్సిందే!" అన్నాడు.

శేషగిరి అదోలా నవ్వేడు.

"ఒస్ అదా రేపు నువ్వు టిక్కట్టు కొనవసరం లేదులేరా టి. టి. ఇ లందరూ మనకు తెలిసినవాళ్లు. హాయిగా సెకెండు క్లాసులో పంపించే బాధ్యత నాది...సరేనా" అన్నాడు వుత్సాహంగా.

వాళ్ళందరితో వీడికెలా పరిచయమయ్యిందా అని ఆశ్చర్యపోయాను.

"రైల్వేలో వుద్యోగమయ్యిందేవిట్రా?" అన్నాను.

"నీ తెలివి మరీ బావుందిరా చంద్రం! రైల్వే వాళ్ళతో పరిచయం చేసుకుందుకు రైల్వేలోనే వుద్యోగం చెయ్యాలా యేవిటి?" అన్నాడు నవ్వుతూ. నేను మరింకేమీ అనలేదు. రిక్షాలో కూచున్నాం.

"అవుతే, యింతకూ నువ్విప్పుడు వెలిగిస్తున్న వుద్యోగం యేవిట్రా?" అన్నా ఆతృత కొద్దీ.

"టి కంపెనీ యేజంటుగా వున్నాన్లే..." అన్నాడు చాల తాపిగా.

"సేషనుకి యెందుకొచ్చావు యిప్పుడు?"

"వూరికినే...ఇంట్లోవుంటే వుబుసుపోదు.. రోజుకో మారయినా సేషనుకి వస్తాను.. నీలాగే చాలమంది పాతస్నేహితులు కలుస్తారు.." అన్నాడు. కాస్సేపు యిద్దరం మౌనంగా కూచున్నాము. ఇంటి ముందు రిక్షా ఆగింది. దిగాం.. రిక్షా డబ్బులు నేను యివ్వబోతూవుంటే, శేషగిరి ఒప్పుకోకుండా వాడే యిచ్చేశాడు. సామాను గడపలో పడేసి రిక్షావాడు పోయాడు. శేషగిరి గది తాళం తీశాడు. సామాను యిద్దరం చెరోకటీ పట్టుకుని లోపల ప్రవేశించాం. గది పెద్దదే అయినా శుభ్రంగా లేదు.

"మీ వాళ్ళని అమ్మగారింటికి పంపించావా యేవిటి?" అన్నా.

శేషగిరి నా వేపు అదోలా చూశాడు.

"నీకు తెలీదేవిట్రా, మా ఆవిడ పరలోకానికి ప్రయాణం చేసిందని?" అన్నాడు. నేను గతుక్కుమన్నాను.

"అదెప్పుడు? నాకు తెలీదే!" అన్నా "కనీసం ఒక వుత్తరంముక్కయినా రాసుకోవట్రా..."

"ఎవరికీ తెలియపర్చటం నాకిష్టంలేదురా చంద్రం..ఆమధ్య నాకు తటస్థపడిన సంఘటనలన్నీ ఒకె లాంటివి. అమ్మ యేనాడో చనిపోయిందని నీకు తెలిసిన విషయమే కదా! నన్ను ముద్దుగా పెంచి, పెద్దచేసిన నాన్నగారు కూడా పోయారు. నా జీవితపథం అప్పుడే మారిపోయిందనుకున్నాను. మరి కొన్నాళ్ళకి మా ఆవిడ కూడా నన్ను విడిచిపెటి పరలోకం చేరింది. అప్పట్నుంచీ నాకేవిటో జీవితంమీద విరక్తి పుట్టింది. చాలామంది నన్ను మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నారు. నాకిష్టంలేకపోయింది. ఎలాగో జీవితాన్ని సుఖమయం చేసుకుంటూ గడిపేస్తున్నాను." అన్నాడు సంక్షిప్తంగా జీవితాన్ని వెల్లడి చేస్తూ.

వాడి పరిస్థితికి నేను చాలా జాలిపడ్డాను. పాపం, వాడెలా తట్టుకోగలిగాడా అనుకున్నాను. స్నానం చేశాక హోటలుకి తీసుకుపోయాడు అక్కణ్ణించి తిరిగివచ్చి యిద్దరమూ కాస్సేపు విశ్రాంతి తీసుకున్నాం. సాయంత్రం అలా షికారుకు

★ పతనం ★

బయలుదేరాం.

"అవుతే శేషూ! నీ వుద్యోగం యిక్కడే నన్నమాట." అన్నా నాతోనే రోజంతా గడుపుతూవుంటే, మరి వుద్యోగం యెప్పుడు చేస్తున్నాడో అర్థంగాక.

"ఆఁ.. కాని, అప్పుడప్పుడు చుట్టుప్రక్కల వూళ్ళకు వెళ్ళాల్సి వస్తుంది." అన్నాడు.

తరచుగా మూత్రవిసర్జన

తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైనచిహ్నము శరీరాన్ని గుల్లచేయడమేకాకుండా యీ వ్యాధి, తనబంధంలో చిక్కిన వారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసికశ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి చూపు మాంద్యము. తొడల్లో తిమ్మిరి నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో అధికదాహం ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు కాళ్ళలో పగుళ్లు తూకంతగ్గడం శరీరమంతా పోట్లు కీళ్ల నొప్పులు. కంటిపొరలు, క్షయ గడలు రాచపుండ్లు, యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును

"వీనస్‌ఛారమ్" మాత్రలు వాడి, అనేక వేల మంది తమబాధల నుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్య విధానప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహం తగ్గి. పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో సుఖముగా. తేలికగా సేవించవచ్చును దీనికి ప్రత్యేకపథ్యము లేదు నిరాహారముతో నుండే అవసరంలేదు రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటే యెక్కువరకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును

ధర: 50 మాత్రల సీసా రు. 6-75

ప్యాకింగు పోస్టేజీ ఉచితము.

లభించు స్థలము:

Venus Research Laboratory (A.P.W.)
P. O. Box No. 587, Calcutta

"అవుతే చిక్కే నన్నమాట: ఇలా కంపులు వెళ్ళే వుద్యోగమవుతే నాకు అంతగా యిష్టం వుండదు సుమా..."

శేషగిరి చిన్నగా నవ్వేడు.

"నా జీవితానికి మాత్రం యీ వుద్యోగం బాగా సరిపోయిందిరా.. ఏవూళ్లో వున్నా నాకొకటేగా!" అన్నాడు.

"పోనీ, మళ్ళీ పెళ్ళిచేసుకో కూడదూ! ఒక యింటివాడివై వుంటే, యెంత హాయిగా వుంటుంది?" అన్నాను.

"మళ్ళీ నువ్వు మొదటికే వస్తున్నావురా! మరి పెళ్ళి చేసుకోవటం నాకిష్టం లేదని చెప్పానుగా! నేను హాయిగా సంసారం చేసుకుంటే చూచి సంతోషించే వాళ్ళు లేరు. నేను చెడిపోతే విచారించే వాళ్ళు లేరు .. అల్లాంటప్పుడు యెందుకొా లేనిపోని బాదరబందీలు తెచ్చిపెట్టుకోవటం?" అన్నాడు అదోలా నవ్వుతూ.

ఎదురుగా అగుపించే కాఫీహోటల్లోకి దారితీశాడు. వాణ్ణి అనుసరించటం తప్పించి వదలలేకపోయాను. ఎందుకూ అంటే, వద్దంటే వినేరకంకాదు వాడు. కాఫీహోటల్లోంచి బైటపడి మరికాస్సేపు అటూయిటూ తిరిగేశాం. గడిచిపోయిన సంగతులు చాలా చెప్పుకొన్నాం. ఇంటికి తిరిగి వచ్చేసరికి చీకటిపడింది.

"చంద్రం, నువ్వింట్లోనే వుండరా: నేను కేరియర్ తీసుకుని వస్తాను" అన్నాడు శేషగిరి.

"కేరియర్ యెందుకురా? మనమే అక్కడికిపోయి భోంచేస్తే కాదూ' అన్నా అయోమయంగా.

"రాత్రిపూట యెప్పుడూ కేరియర్ తెచ్చుకుంటానే..." అనేసి నా సమాధానానికైనా యెదురుచూడకుండా కేరియర్ పట్టుకుని వెళ్ళిపోయాడు.

వాడి అభిప్రాయమేమిటో నాకేమీ అర్థంకాలేదు. అలా కళ్లప్పగించి చూస్తూ వుండిపోయాను. కాస్సేపటికి శేషగిరి వచ్చేశాడు. టేబిలుమీద యిద్దరికీ రెండాకులు వేసి వడ్డించేశాడు వాడే! తర్వాత బీరువాలోంచి ఓ సీసా తీసి టేబిలుమీద పెట్టేడు. అది బ్రాందీ సీసా! నేను విస్తుపోయాను. రాత్రిపూట వాడెందుకు కేరియర్ తెచ్చుకుంటాడో యిప్పుడు నాకర్థమయ్యింది. సోడా సీసా తెచ్చి గ్లాసులోపోసి అందులో కాస్త పోశాడు బ్రాందీ.

"నువ్వుకూడా కాస్త రుచి చూడరా చంద్రం! ఇది కంట్రీదికాదులే...తప్పు లేదు. పైగా మంచి ఆరోగ్యవంతమైంది కూడాను..." అన్నాడు నవ్వుతూ.

తెల్లమొహంవేసి చూడ్డమే తప్పించి క్షణంవరకూ మాటాడలేకపోయాను. జంకూగొంకూ లేకండా నాముందే ఇలా ప్రవర్తించటం అసహ్యం కలిగించింది.

"ఈ విషయం తెలియపర్చడానికేనా నన్నిక్కడ దిగమన్నావు శేషూ! నాకు తెలీకండా వుండేందుకు యీ ఒక్కరోజూ మానేస్తే యెంతబాగుండేది!" అన్నాను బాధగా.

శేషగిరి బాధపడకపోగా వుత్సాహపూరితంగా నవ్వేశాడు.

"నీకు తెలిస్తేమాత్రం యిందులో తప్పేముందిరా! ఏపనైనాసరే, రహస్యంగా చేసే అలవాటు నాకులేదని నీకు తెలుసుగా! ఇక నేనీ అలవాటికి యెలా దాసుడనయ్యానంటావుకదూ! ఊరూరా తిరిగి తిరిగి వేసారిపోతుంటాను. ఒక్కొక్కప్పుడు చాలా శ్రమ అనిపించేది. అప్పుడే యీ బ్రాందీ అలవాటయ్యింది. ఇప్పుడీ సీసాయే నా స్నేహితుడనుకో! దీనివల్ల నా మనసుకి యెంతో హాయికలుగుతోంది... నాజీవితంలో యింక హాయినిచ్చేది యిది తప్పించి మరేముంది చెప్పు? అయినా ఒక్కమాటచెపాను వినరా! నా డబ్బంతా యేం చేసుకోను? ఆనంద మనిపించేదంతా ఆస్వాదించాలనే నాకోరిక. జీవితంలో మాధుర్యాన్ని కలిగించేది యేది చేతికందుబాటులోవున్నా విడిచిపెట్టను...బ్రతికివున్నన్నాళ్ళేగాని, చచ్చాక యేం అనుభవిస్తాం చెప్పు? నేనిప్పుడిది రుచి చూస్తున్నాననీ, యీ రాత్రంతా ప్రేలాపనలో గడిపేస్తానని అనుకోకు. సమపాళ్ళతోనే వేసుకుంటాను. అలవాటైపోయింది గనుక నాలో యేమీ మార్పుఅగుపించదు. చూస్తావుగా!" అనేసి గడగడా గ్లాసు ఖాళీచేశాడు

శేషగిరిమీద చెప్పలేనంత కోపం వచ్చింది. కసిదీరా ఆ లెంపా యీ లెంపా వాయించాలనుకున్నా. కాని, యెందుకనో కోపాన్ని దిగమింగుకొన్నాను.

"నువ్వెన్ని చెప్పు...యీ అలవాటు మంచిదికాదురా శేషూ! నలుగురి దృష్టిలోను నువ్వు చులకనవుతావు కొన్నాళ్ళకి..." అన్నాను వూరుకోలేక.

శేషగిరి మళ్ళీ చాలా తేలిగ్గా నవ్వేడు.

"అలా అని నువ్వనుకొంటున్నావుగాని చంద్రం, బ్రాందీ, విస్కీ యిల్లాంటి ఖరీదైన పానీయాలు అలవాటు చేసుకున్నవాళ్ళు యింతవరకూ యెక్కడా త్రాగుబోతులు క్రింద జమకట్టబడలేదు. అది ఫ్యాషనుగా చెలామణి అవుతోంది. ఇక పోతే డబ్బు విషయముంటావా, నాకా భయం లేదు...ఎందుకూ అంటే కేవలం మోతాదుగానే తీసుకుంటున్నానుగనుక... లేకపోయినా మా నాన్న గడించి పెట్ట

పోయావుగా :"

"సరే, నీ యిష్టం..." అనేసి భోజనానికి వుపక్రమించాను.

"అలానే అనేశావుగాని, ఒక వేళ నువ్వే నా పరిస్థితిలో వుంటే, యేం చేసేవాడివో ఆలోచించావా?" అన్నాడు మళ్ళీ.

"అవన్నీ యిప్పుడెందుకులే...ముందు భోజనం ముగించు...బాగా నిద్రవస్తోంది.. పడుకోవాలి వేగిరం..." అన్నాను...

భోజనాలయ్యాయి. శేషగిరి పక్కలు యేర్పాటు చేశాడు. వాడు అన్నటుగానే వాడిలో యేమీ మార్పురాలేదు. మామూలుగానే మాట్లాడాడు. అందుకు ఒక విధంగా సంతోషించాను. ప్రయాణపు బడలికలో వున్నానేమో, త్వరలో నిద్రపట్టేసింది.

* * *

మరుచటి రోజు వుదయం కాఫీ త్రాగాక ప్రయాణం కట్టాను...శేషగిరి అటంక పర్చలేదు.

"అటంక పర్చవని మాటిచ్చానుగాని, లేకుంటే రెండురోజులవరకూ నిన్ను కదలనిచ్చేవాణ్ని కాదురా చంద్రం...అఁ... అప్పుడే ప్రయాణ సన్నాహ మెందుకూ? మెయిలు వచ్చేందుకు యింక చాల వేళ వుంది" అన్నాడు శేషగిరి.

"ఇక్కడ మాత్రం వుండి యేం చేసాం" ఆ వుండటం స్టేషనులోనే వుందాం పద" అన్నాను.

సరే అంటూ బెలుగేరాడు శేషగిరి. ఇద్దరమూ స్టేషను చేరుకున్నాము. మెయిలు వచ్చేందుకింకా చాల వేళ వుంది. వెయిటింగ్ రూమ్‌లో కూచుని కాస్సేపు కబురు చెప్పుకున్నాక అలా తిరిగి రావాలనిపించింది.

"లేరా, అలా తిరిగివద్దాం" అనిలేచాను. శేషగిరి సామాన్ను బేరాకి అప్పజెప్పి వచ్చాడు. ప్లాటుఫారమ్ యేమంతగా క్రిక్కిరిసి లేదుగాని, ప్రయాణీకులు బాగానే వున్నారు. ఇద్దరమూ ఒకరి ప్రక్క ఒకరు నడుస్తున్నాం. ఇంతలోనే ఒక స్త్రీ మాకు యెదురుగ వస్తూ శేషగిరి వేపుగామోసు చూసి యింత మొహం చేసుకుని వచ్చింది. వాడు యిరుకునపడాడు. పాపం. నేనది గమనించానేమోనని నావేపు ఓమారు తిరిగి చూశాడు. ఏం లాభం. అప్పటికే ఆమె దగ్గరిగా వచ్చేసింది.

"శేషగిరి గారికి మా మీద కోపం వచ్చినట్టుంది...యేమండీ :" అంటూ నిల్చుండిపోయింది ఆమె యెవరో విషయమేమిటో నాకేమీ అర్థం కాలేదు.

"అబ్బే : అదేం కాదులే సుశీ! కాస్త పనుంది వస్తా...తర్వాత మాటాడుదాం" అనేసి తప్పుకున్నాడు శేషగిరి. ఆమెకి కాస్త దూరమయ్యాం.

నాలో కలిగిన ఆత్రుత భరించలేక "ఎవర్రా?" అని అడిగేశాను మెల్లగా. శేషగిరి మెల్లగా నవ్వుతూ.

"దాపరిక మెందుకుగాని, ఆమె యెవరో మాటలబట్టి అర్థం చేసుకోలేక పోయావురా? అన్నటు నువ్వెలా అర్థం చేసుకొంటావులే.. నువ్వు చాల బుద్ధిమంతుడివికదూ! సుశీల అనే వేశ్య...ఇప్పుడర్థమయ్యిందా?" అన్నాడు.

నా కళ్ళు గిర్రున తిరిగాయి. శేషగిరి యింతగా దిగజారిపోతాడని నేనెప్పుడూ అనుకోలేదు.

"అవుతే శేషూ : యీవిడతో బాగా పరిచయ ముందన్న మాట!" అన్నాను.

"ఈవిడతో నన్న మాటేవిట్రా? ఇల్లాంటి యువతులు చాల మందితో పరిచయముంది.... నేను మొదటే చెప్పానుకదూ, జీవితంలో మాధుర్యాన్నిచ్చేది యేది అందుబాటులో వున్నా విడిచిపెట నని..." అన్నాడు.

వాడి సిగ్గుమాలిన తనానికి నేనెంతగానో దూషించాను మనసులో.

"ఒక్క మాటరా శేషూ : నువ్వుబాగా దిగజారి పోతున్నావు...ఇప్పుడు కాకపోయినా మరోకప్పుడైనా పశ్చాత్తపడావు..." అన్నాను ఒక పక్క కోపం వస్తుంటే.

"అది నీ అభిప్రాయం. కాని, నేనే మంటానో తెలుసా, యిదంతా జీవిత మాధుర్యం అంటాను. బ్రతికి వుండగా మధురానుభూతుల్ని పొందలేనివాడి జీవితం వృధా అంటాను...యిదే నా ఆశయం" అన్నాడు.

వాడి మొండి వాదనకి నేనేంజవాబు చెప్తాను? ఇంతలోనే దూరంలో రైలుకూత విన్పించింది. ఇరువురం వెనక్కి తిరిగాము.

నేను బండిలో కూచున్నాను. శేషగిరి ఒక టి. టి. ఇని తీసుకుని వచ్చాడు నన్ను అప్పజెప్పడానికి. ఆ టి. టి. ఇని చూసేసరికి అతిన్ని యెక్కడో చూసినట్లనిపించింది. మెదడుకి పని కల్పించాను. జ్ఞప్తికి వచ్చింది.

"నమస్కారమండీ, రాఘవరావుగారూ" అన్నాను.

"నమస్కారం ... ఓహో, మీరా..." అన్నాడతను.

మా యిరువురికీ యెలా పరిచయమయ్యిందా అని ఆశ్చర్య పోయాడు శేషగిరి.

"బరంపురంలో వీళ్ళ బావమరిదికీ నాకూ మంచి స్నేహం వుండేదిలే శేషూ: ఒకసారి అక్కడే మా యిద్దరికీ పరిచయమయ్యింది. మీరిద్దరూ స్నేహితులని యిప్పటివరకూ నాకు తెలీదు." అన్నాడు రాఘవరావు.

"మే మిద్దరం చిన్నప్పట్నుంచి స్నేహితులంలెండి..." అన్నాన్నేను.

ఇంజను కూత పెట్టింది.

"మీరిక్కడే కూచోండి... మరో స్టేషన్లో వస్తాను ... వస్తా శేషూ" అనేసి రఘువరావు వెళ్ళిపోయాడు.

"చంద్రం, చాలా కాలానికి మనిద్దరం కల్సుకుని త్వరలో మళ్ళీ విడిపోతున్నాం. ప్రస్తుతం నేను గడుపుతున్న జీవితం నువ్వు పూర్తిగా అవగాహన చేసుకుని వుంటావనుకుంటాను. నీ దృష్టిలో నేను చెడిపోతున్న వ్యక్తిని...లేదా చెడిపోయినవాణ్ణి. ఏం చెయ్యను! నా జీవిత పథం అలా మారిపోయింది." అన్నాడు నిర్లిప్తంగా.

శేషగిరిలో దాక్కొని వున్న యే నిరాశో అతణ్ణిలా మార్చి వుంటుందని అర్థం చేసుకుందుకు అట్టేకాలం పట్టలేదు. నేనేమీ మాట్లాడలేక పోయాను. బండి కదిలింది. పదడుగుల వరకూ పెట్టె ప్రక్కనే నడిచాడు శేషు.

"ఉత్తరాలు రాస్తూవుండరా!" అన్నాను.

"అలాగే" అన్నాడు.

"వస్తా... యిక వుండు" అన్నాను. వాడలా కర్రబొమ్మలా నిల్చుండిపోయాడు. కనుచూపు మేరవరకూ యిద్దరం చేతులు వూపుకున్నాం...రైలు వేగం హెచ్చించింది. చెమర్చిన నాకళ్ళు ఒత్తుకున్నాను.

* * *

రోజులు గడుస్తున్నాయి. మా యిరువురి మధ్య మళ్ళీ వుత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభమై సాగిపోతున్నాయి. కొన్నాళ్ళు పోయాక శేషగిరి నుండి వుత్తరాలు రావటం ఆగాయి. నా కెందుకో ఆత్రుత కలిగింది. రాఘవరావుకి వుత్తరం రాశాను. నాలుగు రోజుల్లో రాఘవరావు దగ్గర్నించి వుత్తరం వచ్చింది. ఆ వుత్తరం చదువుకుని నీరైపోయాను. శేషగిరిని ఓరోజు పోలీసులు మద్రాసు తీసుకు పోతుండటం మాత్రం తను చూశాననీ, కారణం యెంత ప్రయత్నించినా తెలిసింది కాదని రాశాడు రాఘవరావు.

నిజంగా నేను చాలా బాధపడ్డాను. ఎంతో వున్నతికి వస్తాడనుకున్న వ్యక్తి యింతగా దిగజారిపోయాడు?... అనుకున్నా. ఎంత ఆలోచించినా, యే కారణాలవల్ల అరెస్టు చేయబడ్డాడో నావూహాకి అందింది కాదు. పాపం, జీవితమాధుర్యాన్వేషణలో అన్నీ దురలవాటకే దాసుడయ్యాడు శేషగిరి: ఏ కారణమైనా అయ్యుండొచ్చు ...అనుకున్నా చెమ్మగిల్లిన కళ్ళు ఒత్తుకుంటూ—'నాకోసం బాధపడే వాళ్ళెవరున్నార్రా?' అని అనాడు వాడన్న మాట జ్ఞప్తికి వచ్చిందప్పుడు. ★